సింగ్‌నగర్‌లో రెచ్చిపోతున్న ఆకతాయిలు!

- ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్, లూనాసెంటర్, లెనిన్‌సెంటర్‌లో జనం బెంబేలు
- తన కుమార్తెను ఏడిపించడంతో మందలించిన ఓ వ్యక్తిపై పది మంది దాడి
- రోజు రోజుకు మితిమీరుతున్న ఆగడాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న ప్రజలు



ఎంకే బేగ్ హైస్కూల్ వద్ద పోలీసులకు తమ గోడును చెబుతున్న స్థానికులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ 59వ డివిజన్‌లో ఆకతాయిల సమస్య రోజు రోజుకు పెరిగిపోతుంది. ప్రధానంగా పాఠశాలలను కేరాఫ్ అడ్రస్‌లుగా మార్చుకొని గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సభ్యులు చెలరేగిపోతున్నారు. పాఠశాలకు వచ్చి వెళ్లే విద్యార్థినులే టార్గెట్‌గా చేసుకొని నిత్యం అల్లర్లకు పాల్పడడం.. అదేమని ప్రశ్నించిన వారిపై దాడులకు దిగజారడం పరిపాటిగా మారిపోయింది. ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్ పరిసర ప్రాంతాలు బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ సభ్యులకు నివాస ప్రాంతాలుగా మారిపోయాయి. ఇక్కడి లూనా సెంటర్, లెనిన్ సెంటర్ ప్రాంతాల్లో పగలు రాత్రి తేడా లేకుండా పదుల సంఖ్యలో ఆకతాయిలు రోడ్లపై ఆటోల్లో కూర్చొని విద్యార్థినులు, మహిళలు, యువతులను వేధింపులకు గురిచేస్తున్నారు. ఇలా చేయడం తప్పని చెప్పినా.. ఎందుకిలా చేస్తున్నారని ప్రశ్నించినా ఇక వారి పని అంతే వెంటనే పదుల సంఖ్యలో బ్లేడ్లు, కర్రలు తీసుకొని ఆ వ్యక్తులపై విరుచుకపడి దాడులు చేస్తున్నారు. బుధవారం ఇదే విధంగా ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిని ఆకతాయిలు నిత్యం వేధింపులకు గురిచేస్తున్నారు. విషయం తెలుసుకున్న బాలిక తండ్రి పాఠశాల వద్దకు వచ్చి చూడగా మళ్లీ అదే విధంగా ఆమె వెంటపడి ఏడిపించడం చేస్తున్నారు. దీంతో అతను వారిని పిలిచి మందలించేందుకు ప్రయత్నించగా ఆకతాయిలు ఒక్కసారిగా రెచ్చిపోయి



ఆకతాయిల సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతం

మాకే నీతులు చెబుతావా ఉండు నీ అంతు చూస్తామంటూ బైకులపై వెళ్లి వెంటనే బ్లేడ్లు, కర్రలు తీసుకొని పది మంది వరకూ వచ్చేసి బాలిక తండ్రిని ఇష్టం వచ్చినట్లుగా చితకబాదారు. బాధితులు 100కు ఫోను చేసి సమాచారం ఇవ్వగా వారంతా అక్కడి నుంచి పరారయ్యారు. ఇలా ప్రతి రోజూ ఆకతాయిలు నిత్యం అల్లర్లు, గొడవలకు పాల్పడుతున్నారని పాఠశాల చుట్టుపక్కల ప్రాంతాల్లో ఒంటరిగా రావాలంటేనే భయమేస్తుందని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు పాఠశాల వేళల్లో తప్పనిసరిగా ప్రత్యేక పోలీసు బీట్లు ఏర్పాటుచేసి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

సమస్యాత్మక ప్రాంతాలివే....

58, 59 డివిజన్‌లలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సభ్యుల ఆగడాలు అధికంగా ఉంటున్నాయి. లూనాసెంటర్, ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్, లెనిన్‌సెంటర్, వాటర్ ట్యాంక్ రోడ్డు, యార్డ్‌రోడ్డు, వివేకానందసెంటినరీ హైస్కూల్, మాకినేని బసవపున్నయ్య మున్సిపల్ స్టేడియం, నార్త్‌జోన్ తహశీల్దార్ కార్యాలయం, సింగ్‌నగర్ ఫ్లైఓవర్ కింద భాగాల్లో గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సభ్యులు ఎక్కువగా తిష్టవేసి ఉంటున్నారు. చీకటిపడితే చాలు పదుల సంఖ్యలో వీరు గుంపులుగా చేరి ఆ ప్రాంతాల్లోనే గంజాయి సేవించడం, వారిలో వారు గొడవల పడడం, అటుగా వెళ్లే వారిని బెదిరించి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సింగ్‌నగర్ పోలీసులు ఈ ప్రాంతాలల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయాలని స్థానిక ప్రజలు ప్రాదేయపడుతున్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో రాజరాజేశ్వరి దేవి అమ్మవారు



అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని దేవాలయాల్లో శుక్రవారం శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పూజలు ఘనంగా నిర్వహించారు. మధురానగర్‌లో స్వయంభూ బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో రాజరాజేశ్వరి అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన కుంకుమార్చనలు , శ్రీచక్రార్చనలు ఘనంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు పర్యవేక్షించారు. మధురానగర్ నేతాజీ కాలనీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



ముత్యాలంపాడు పార్వతీసమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో అమ్మవారు

ముత్యాలంపాడు పార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. దత్తసాయి శివ కామేశ్వరీపీఠంలో ధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన ప్రత్యేక కుంకుమ పూజలు, శ్రీచక్రార్చనలు, చండీ హోమం నిర్వహించారు. సత్యనారాయణపురం శివకేశవ దేవాలయంలో అమ్మవారికి ఆలయకమిటీ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



బోస్‌నగర్లో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని

డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని

పాయకాపురం(విజయవాడరూరల్): పరిసరాల శుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు. 64వ డివిజన్ ఎస్ఎస్‌సీ బోస్‌నగర్లో శుక్రవారం నిర్వహించిన డ్రై డే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పరిసర ప్రాంతాలను వైద్య సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. కూలర్లు, ఫ్రిజ్‌లలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని తెలిపారు. అలాంటి చోట్ల దోమలు గుడ్లు పెట్టే అవకాశముంటుందని పేర్కొన్నారు. దీని వల్ల డెంగీ, మలేరియా లాంటి ప్రమాదకర జ్వరాలు వచ్చే వీలుంటుందని చెప్పారు. ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం స్థానికులతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తామని, దోమల పెరుగుదల నిర్మూలనకు కృషి చేస్తామని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి డాక్టర్ నిహారిక, ఏఎన్ఎమ్‌లు, ఆశావర్కర్లు, మలేరియా సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు గరుత్మంతుడి విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోనే ప్రప్రథమంగా ముత్యాలంపాడు కోదండ రామాలయంలో 36 అడుగుల గరుత్మంతుడు విగ్రహ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేయనున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి దాట్ల శివరామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాల సర్ప నాగదోష, దుష్ట శక్తులు, సర్పదోష నివారణ, రుణబాధలు అనారోగ్య సమస్యలు తొలగి ప్రజలు సుఖసంతోషాలతో ఉండేందుకు గానూ తాము 36 అడుగుల గరుత్మంతుడు విగ్రహ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేటి నుంచి సంతోషిమాత జయంతి ఉత్సవాలు



పాయకాపురం(విజయవాడరూరల్): నేటి నుంచి 11వ తేదీ వరకు పాయకాపురంలోని జై సంతోషిమాత ఆలయంలో జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని రకాలుగా సౌకర్యాలు కల్పించామని ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్ని చిట్టిబాబు తెలిపారు. అమ్మవారి జన్మ నక్షత్రం రాఖీ పౌర్ణమి రోజున రావడం పట్ల గత కొన్ని సంవత్సరాలు అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీమంత్రి నాగేశ్వరరావు చెప్పారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లి జై సంతోషిమాత అన్నారు.

మహనీయుల త్యాగాలు సదా స్మరణీయం



విజయవాడ కల్చరల్: మహనీయుల త్యాగాలు సదా స్మరణీయని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. ఆలిండియా ఘంటసాల చైతన్యవేదిక, శ్రీ కళా భారతి, తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా భారత దేశం–నాడు– నేడు అంశంగా సదస్సు, దేశ భక్తి గీతాల కార్యక్రమాన్ని గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద శుక్రవారం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ నేటి భారత దేశం అగ్రదేశాలను సహితం శాసించేస్థితికి చేరుకుందని తెలిపారు. మహనీయుల త్యాగాలతో వచ్చిన స్వాతంత్ర్య లక్ష్యాలను కాపాడుకోవాలన్నారు. ఘంటసాల చైతన్యవేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ నాటి సినిమాల్లో పాటలు యువతను చైతన్య పరిచాయన్నారు. గాయనీ గాయకులు మల్లాది స్వాతి, టి. శ్రీనివాసరెడ్డి, దుర్గానాగమణి, పరమేశ్వరి, కె.డేవిడ్‌రాజు తదితరులు దేశ భక్తి గీతాలను ఆలపించారు.

కంపాక్టర్ బిన్స్‌ని పెంచాలి



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో వ్యర్థాలు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో కంపాక్టర్ బిన్స్ సంఖ్యను మరింత పెంచాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. లబ్బీపేట వాటర్ ట్యాంక్ రోడ్డు, ఎర్రమేడ రోడ్డు, బోయపాటి మాధవరావు వీధి, క్రీస్తురాజుపురం, డెంటల్ కాలేజ్ రోడ్డు, గవర్నమెంట్ హాస్పిటల్ సర్వీస్ రోడ్డు, బీఆర్‌టీఎస్ రోడ్డు, నరసరాజు రోడ్డు, అయోధ్య నగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. కంపాక్టర్ బిన్స్‌ని ఎక్కువగా ఏర్పాటుచేసి వ్యర్థాలు రోడ్డుపైన పడకుండా చూసుకునే ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వ్యర్థాలు తొలగింపులో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని కోరారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పాలని తెలిపారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వేధింపులకు గురి చేస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు చేయగా కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. టీనర్‌పేట కొండ ప్రాంతంలో షేక్ హేమలత, చాన్‌బాషా కుటుంబం నివాసం ఉంటుంది. వీరిద్దరిది ప్రేమ వివాహం కాగా, ఒక బాబు సంతానం. ఆటో నడుపుకుని జీవనం సాగించే చాన్‌బాషా కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. తరుచూ భార్యను వేధింపులకు గురి చేయడమే కాకుండా పుట్టింటికి వెళ్లి కట్నం తీసుకురావాలని ఒత్తిడి చేసేవాడు. దీంతో బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

బీజేపీ చేతిలో కీలు బొమ్మగా ఎన్నికల కమిషన్

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు



ఎస్ఐఆర్ కు వ్యతిరేకంగా ధర్నా చౌక్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రధాని మోడీకీ తొత్తుగా మారిందని, కీలుబొమ్మగా మారి బీజేపీ ఏం చెబితే అదే చేసే విధంగా తయారైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. విజయవాడ అలంకార్ సెంటర్ లోని ధర్నా చౌక్ నందు ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఇది రాజ్యాంగానికే ప్రమాదమని హెచ్చరించారు. దేశ ప్రజల ఓటు హక్కును కాలరాసేందుకే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్–సర్)ను తీసుకొస్తుందన్నారు. బీహార్ రాష్ట్రంలో 15 లక్షల ఓట్లు తొలగించారని, మరో 45 లక్షల ఓట్లు త్రిశంకు స్వర్గంలో ఉన్నాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో మొట్టమొదటిసారిగా ఓటరు తనకు తానే ఓటర్‌ను అని నిరూపించుకునే బాధ్యతను ఓటర్లపైనే పెట్టారని, ఇది అప్రజాస్వామికం, నిరంకుశమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని ప్రజలకు ఓటు హక్కును నిరాకరించడమే ఎస్ఐఆర్ లక్ష్యమని, దీనిని పూర్తిగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్ల అక్రమ తొలగింపు ఆపాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, దొడ్డిదారిన ఎన్ఆర్‌సి అమలు ఆపాలని కోరుతూ నినాదాలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ టీడీపీ ఎంపీలు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఢిల్లీలో లేఖ ఇవ్వడం జరిగిందని, అంతటితో ఆగకుండా ప్రతిపక్షాలు జరిపే పోరాటంలో కలిసి రావాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేస్తోందన్నారు. సర్‌కు వ్యతిరేకంగా ప్రజాస్వామిక వాదులు, వామపక్ష వాదులు ఆందోళన చేస్తున్నారన్నారు. ప్రతిపక్షాల ఆందోళనలకు తలొగ్గి ఎన్నికల కమిషన్ తన తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ రాజకీయవ్యవస్థను, పార్లమెంటరీ వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ఉమ్మడి ఉద్యమంగా అందరూ పని చేయాలని పిలుపునిచ్చారు. ఎన్‌డీఏ పాలనలో దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. రాజ్యాంగ బద్ధంగా స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ బీజేపీ చేతిలో పావుగా మారిందన్నారు. ఎన్నికల కమిషన్‌ను నియమించే వ్యవస్థను దెబ్బతీశారన్నారు. ఇప్పుడు ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేయడం, అక్రమాలకు పాల్పడటం చూశామని, ఇకపై ఎన్నికల్లో ఏకంగా ఓట్లు లేకుండా చేయడం చూస్తామన్నారు. సర్ భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశమంతటా అమలు కాబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, చుక్కపల్లి తిరుమలరావు, టాక్స్‌పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎంవీ ఆంజనేయులు డీవీ కృష్ణ, అంద్ర మల్యాద్రి, ఎస్‌సిహెచ్ శ్రీనివాస్, బోయి సత్యబాబు, బి.రమణరావు, పి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు జరుగుతున్నందున శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టు కాలనీ, ఎన్‌జిఓ కాలనీ, రాజీవ్‌నగర్, ఎంఐజీ కాలనీ, ఎల్ఐజీ కాలనీ, ఈడబ్ల్యుఎస్ కాలనీ, విశాలాంధ్ర కాలనీ, డాక్టర్స్ కాలనీ, రాధానగర్, ప్రజాశక్తినగర్, బర్మాకాలనీ, పాయకాపురం, భగీరథ కాలనీ, ఏపీఎస్ రెడ్డి రోడ్డు, ప్రకాష్‌నగర్, సుందరయ్య నగర్, ఎల్‌బిఎస్ నగర్, పటేల్ నగర్, లక్ష్మీనగర్, ప్రశాంతి నగర్, శాంతినగర్, దేవినేని గాంధీపురం, కండ్రిక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో శనివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి.రవీంద్రబాబు, సింగ్‌నగర్ ఏఈ డి.కిరణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులంతా విద్యుత్ అంతరాయాన్ని గుర్తించి తమకు సహకరించాలని కోరారు.

వైభవంగా సౌభాగ్యలక్ష్మి పూజలు



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రావణమాసం వరలక్ష్మీవ్రతం సందర్భంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం వైభవంగా వరలక్ష్మీ పూజ నిర్వహించారు. టీటీడీ దేవాలయ అర్చక స్వాములు పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్త్రీలకు సౌభాగ్యాన్ని అందించే పసుపు, కుంకుమ, గాజులు, వరలక్ష్మీ కంకణాలను స్వామివారికి సమర్పించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి మాట్లాడుతూ శ్రావణమాసాన్ని మహిళలు పవిత్రమైన మాసంగా భావిస్తారన్నారు. ఆగమ శాస్త్ర ప్రకారం పూజాదికాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సూపరింటెండెట్ ఆర్. మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలలో టీటీడీ అనుబంధ 60 దేవాలయాల్లో కంకణాలు సౌభాగ్య కిట్‌ను అందజేసినట్లు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు రూ. 26 వేలు జీతం ఇవ్వాలి

వీఎంవీయూ ప్రధాన కార్యదర్శి బుద్ధ రాజా

విద్యాధరపురం/వించిపేట(విజయవాడపశ్చిమ): నగరంలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు రూ.26 వేలకు తగ్గకుండా జీతాలు ఇవ్వాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్ధ రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం 55వ డివిజన్ శానిటరీ కార్యాలయం వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో ఇంటి అద్దెలు, కరెంటు బిల్లులు, నిత్యవసరాలను చెల్లించుకోవాలంటే జీతాల మీద ఆధారపడి జీవించే పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీస వేతనం అమలు చేయకుండా అరకొర జీతాలతో పనిచేస్తున్న వీరికి మరోపక్క పనిభారం కూడా పెరిగిపోయి అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కనీస వేతనం అమలు చేయకపోడం దుర్మార్గమని, తక్షణమే వారికి జీతాలు పెంచి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆరోగ్యకర సమాజ నిర్మాణమే లక్ష్యం



ఎముకల నిర్మాణంపై విద్యార్థులకు వివరిస్తున్న వైద్యులు

గన్నవరం రూరల్: ఆరోగ్యకర సమాజ నిర్మాణమే లక్ష్యమని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ అన్నారు. శుక్రవారం 5వ రోజు కళాశాలలో మెడికల్ అండ్ హెల్త్ ఎగ్జిబిషన్ సందడిగా కొనసాగింది. విజయవాడ నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు 3500 మంది ఎగ్జిబిషన్ సందర్శించారు. 1500 పైగా ప్రజలు ఈ ప్రదర్శనకు విచ్చేసి ఆరోగ్య అవగాహన పొందారు. డాక్టర్ భీమేశ్వర్ మాట్లాడుతూ మూఢ నమ్మకాలు, నాటు వైద్యాలు పని చేయవని, శాస్త్ర, సాంకేతిక సామర్థ్యాలతో వైద్యం ప్రజలకు అందాలన్నారు. మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు, డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, డాక్టర్ రాజగోపాల్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, డెప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కల్యాణి, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.


డెంటల్ కళాశాలలో..

చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో శుక్రవారం 5వ రోజు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు ఆధ్వర్యంలో ఎక్స్‌ప్లోర్– 25 ఎగ్జిబిషన్ జరిగింది. 9 విభాగాల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలను విద్యార్థులు తిలకించారు. ప్రిన్సిపాల్ రామోజీరావు మాట్లాడుతూ అధునాతన క్యాడ్‌క్యామ్ డిజిటల్ మిషన్‌ను రూ.70 లక్షలతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పంటిని స్కానింగ్ ద్వారా తీసుకుని తయారు చేసి అతితక్కువ ఖర్చుతో గంటలో అమర్చటం జరుగుతుందన్నారు. హెచ్‌వోడీలు కాశేశ్వరరావు, అజయ్ బెనర్జీ, వైద్యులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మతిస్థిమితం లేని వ్యక్తి ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన ఘటన విద్యాధరపురం సితారా సెంటర్‌లో చోటుచేసుకుంది. ఏనుగతల నరసింహారావు లారీ క్లీనర్‌గా పనిచేసేవాడు. గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. మతి స్థిమితం లేదు. ప్రతి రోజూ ఇంటి వద్ద నుంచి సితారా సెంటర్ వరకు వెళ్లి వస్తుంటాడు. గత నెల 29న ఇంటి నుంచి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం వెతికినా కనిపించలేదు. దీంతో ఆయన భార్య పద్మావతి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వైఎస్ విగ్రహం తొలగింపుపై నేతలు ఫైర్



విగ్రహాన్ని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

నందిగామటౌన్: నందిగామలో గురువారం రాత్రి చట్టాన్ని ఉల్లంఘించి పట్టణ నడిబొడ్డున ఉన్న మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించిన మున్సిపల్ కమిషనర్, ఏఈలపై కేసు నమోదు చేయాలని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ దేవినేని అవినాష్ డిమాండ్ చేశారు. పోలీస్ పహారాలో ఈ దారుణ చర్యకు పాల్పడ్డారని మండిపడ్డారు. అత్యంత నాణ్యమైన సీసీ కెమెరాలున్నాయని వాటి పుటేజీలు తీసి విగ్రహాన్ని తీసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఏనాడు కక్షపూరిత చర్యలకు తావులేని నందిగామలో ప్రస్తుతం విష సంస్కృతికి తెర తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన 13 నెలల కాలంలో కూటమి పాలకులు అక్రమ సంపాదనలో వాటాల కోసం తన్నుకోవడం తప్ప నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. విగ్రహాలు తొలగించిన అధికారులు, నేతలను చట్టం ముందు నిలబెట్టి తీరుతామని దేవినేని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన మరుసటి రోజే నందిగామలో విధ్వంసక పాలనకు తెరతీశారని చెప్పారు. రెవెన్యూశాఖ పరిధిలో ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని మున్సిపల్ అధికారులు ఎలా తీస్తారని ఆయన ప్రశ్నించారు. తిరువూరు సమన్వయకర్త నల్లగట్ల స్వామి దాసు మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను సైతం లెక్క చేయకుండా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కన్వీనర్ పూనూరు గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల గుండె చప్పుడు అని తెలిపారు. పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిన మహానేత రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని పునఃప్రతిష్ట చేసే బాధ్యత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని వెల్లడించారు.

కొనసాగుతున్న పవిత్రోత్సవాలు



హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, ఉభయదాతలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో వేంచేసి ఉన్న శ్రీభూ సమేత వేంకటేశ్వరస్వామి సన్నిధిలో పలు ప్రత్యేక హోమాలు శుక్రవారం నిర్వహించారు. వన్‌టౌన్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు పలు ప్రత్యేక వైధిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం విస్వక్సేన పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆగమ పండితులు ఆధ్వర్యంలో హోమాలను నిర్వహించారు. పుణ్యాహవాచనం, పవిత్రశయాధివాసం, సుత్రాభిమర్శన, అగ్నిప్రతిష్టాపన, ఆకల్మష హోమాదులు, సర్వదైవత్యహోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తులను యాగశాలకు మంగళవాయిద్యాలతో మంత్రోచ్ఛరణలతో పండితులు తీసుకొచ్చారు. అనంతరం సంకీర్తనాగానాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో సన్యాసిరావు మాట్లాడుతూ 9న స్వామి వారికి విశేష కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. విష్ణు సహస్ర నామపారాయణం కార్యక్రమం జరుగుతుందని, ఉదయం స్వామి వారికి స్నపనాభిషేకాన్ని నిర్వహిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అర్చకస్వాములు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి కార్యక్రమాలను నిర్వహించారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న మునేరు



కంచికచర్ల: డివిజన్‌లో కురుస్తున్న వర్షాలతోడు ఎగువ ప్రాంతాలైన తెలంగాణ రాష్ట్రం ఖమ్మం, వైరా, వరంగల్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కీసర మునేరుకు భారీగా వరదనీరు చేరుతోంది. కీసర మునేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు శుక్రవారం సూచించారు. పశువులను కూడా నదిలో తోలుకెళ్లరాదని రైతులను కోరారు.